క్లుప్తంగా

వంద రోజుల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలి

- హౌసింగ్ డీఈ హనుమప్ప



మాట్లాడుతున్న డీఈ హనుమప్ప

కూడేరు: అసంపూర్తిగా నిర్మాణ దశలో ఉన్న పక్కా ఇళ్లను వంద రోజుల్లో పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ డీఈ హనుమప్ప ఆదేశించారు. సోమవారం ఆయన కూడేరులోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కుళ్లాయి స్వామితో కలిసి ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ అధికారులతో సమావేశమయ్యారు. మండలంలో 406 పక్కా గృహాలు వివిధ నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. నిర్మాణాలు ఆలస్యంగా చేపడితే కేటాయించిన బడ్జెట్ వెనక్కి వెళ్లే అవకాశం ఉందని, తద్వారా లబ్ధిదారులు నష్ట పోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్ అశోక్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు స్పందన కరువు

కూడేరు: కూడేరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మండల ప్రజల నుంచి స్పందన కరువైంది. అన్ని శాఖల అధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశించినా మండల అధికారులు బేఖాతర్ చేస్తున్నారు. ఇక్కడ అర్జీలు ఇచ్చినా సమస్యలు పరిష్కారం కావని కలెక్టరేట్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తున్నారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో డీటీ సూర్య ప్రతాప్, సీఎస్‌డీటీ లక్ష్మీదేవి, ఏఓ విజయకుమార్ హాజరయ్యారు.

కణేకల్లులో భారీ వర్షం

కణేకల్లు: కణేకల్లు, కణేకల్లు క్రాస్, యర్రగుంట, నల్లంపల్లి, పుల్లంపల్లి, కె.కొత్తపల్లి తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. వంకలు, వాగులు పొంగి ప్రవహించాయి. కంది, మిర్చి, మొక్కజొన్న పంటల్లో వరదనీరు నిలిచినట్లు రైతులు తెలిపారు. బస్టాండ్ వద్ద, కణేకల్లు క్రాస్‌లో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి.

ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ

కూడేరు: మండలంలోని బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో సీఏటీసీ 9 ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. సోమవారం ఎన్‌సీసీ అధికారులు క్యాడెట్లకు అబ్‌స్టెకల్స్‌పై శిక్షణ ఇచ్చారు. దేశ సరిహద్దులో దేశ రక్షణ కోసం పని చేసే ఆర్మీ సైనికులు గుట్టలు, గుంతలు, ఎంతైన ప్రాంతాలను సునాయాసంగా ఎలా ఎక్కగలరో ఎన్‌సీసీ అధికారులు క్యాడెట్లకు అవగాహన కల్పించారు. క్యాంప్ కమాండర్ కల్నల్ జోబీ ఫిలిప్స్ మాట్లాడారు. కర్నూలు, అనంతపురం, నంద్యాల, పుట్టపర్తి జిల్లాలకు చెందిన 530 మంది క్యాడెట్లు సుబేదర్ ఎంఆర్ బాషా, ఎన్‌సీసీ అధికారులు దయామణి, హేమదుర్గా, గంగన్న, ప్రకాష్ పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులు చేయొద్దని సర్పంచు అల్టిమేటం

గుమ్మఘట్ట: ఉపాధి హామీ కింద సాగైన ఉద్యాన పంటలకు బిల్లులు చేయొద్దని రంగ సముద్రం గ్రామ పంచాయతీ సర్పంచు .. టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లకు అల్టిమేటం జారీ చేశాడు. దీంతో బాధితులు ఉద్యాన రైతులు ఈరమ్మ, నాగిరెడ్డి, అనసూయమ్మ, మల్లారెడ్డి అనే రైతులు ఎంపీడీఓ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌ను సోమవారం కలిసి సమస్యను విన్నవించారు. బిల్లులు చేయాలని కోరారు. బిల్లులు ఆపాలని తమకు సర్పంచ్ ఒత్తిడి చేయడంతో నిలబెట్టామని టెక్నికల్ అసిస్టెంట్ రామాంజనేయులు బాధితులకు తెలిపారు. దీనిపై ఏపీఓ సురేశ్‌ను అడగ్గా, ఈ విషయం తన దృష్టికి రాలేదన్నారు. పరిశీలించి బిల్లులు పెండింగ్‌లో లేకుండా చూస్తామని తెలిపారు.

'పల్లె పండుగ'తో అభివృద్ధి



మాల్యంలో సిమెంటు రోడ్డు పనికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

కణేకల్లు: 'పల్లె పండుగ'తో గ్రామాల్లో అన్నీ వసతులు కల్పించి గ్రామాలను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం మండలంలోని మాల్యంగ్రామంలో 'పల్లెపండుగ' కార్యక్రమంలో భాగంగా సిమెంటు రోడ్డు పనికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. కార్యక్రమం కింద గ్రామాల్లో అధ్వానంగా ఉన్న వీధుల్లో సిమెంటు రోడ్లు వేస్తామన్నా రు. మాజీ ఉప సర్పంచు ఆనంద్, టీడీపీ నాయకులు శరబన్నగౌడ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

బొమ్మనహాళ్: గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఉద్దేహాళ్ గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. మూడు సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ దాస్ నాయక్, రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండాపురం కేశవరెడ్డి, కన్వీనర్ బలరామిరెడ్డి, నాయకులు కొత్తపల్లి మల్లికార్జున, ముల్లంగి నారాయణస్వామి, నవీన్ ,సైకిల్‌షాపు హనుమంతు, సల్లాపురం బాబు, కుమ్మరి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

అగ్రి పరీక్ష.. నాణ్యతకు పెద్దపీట

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో ఐదు ల్యాబ్‌ల ఏర్పాటు
- వీటితో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువుల గుర్తింపు
- నెలకు దాదాపు 1,200 పరీక్షలు చేస్తున్న సిబ్బంది



ఉరవకొండలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ టెస్టింగ్ ల్యాబ్



ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహిస్తున్న ఏఓ, ఏఈఓలు

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసింది. వారికి అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందిస్తూ వచ్చింది. ప్రధానంగా పంట వేసే ముందు విత్తనాలు మొదలుకొని పంట పెరిగే కొద్దీ వేసే ఎరువుల విషయంలోనూ జాగ్రత్తలు పాటించింది. రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించేలా చేయాలనే ఉద్దేశంతో ప్రత్యేకంగా విత్తనాలు, ఎరువుల నాణ్యత పరీక్షల కోసం డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసింది. ఈల్యాబ్‌లతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోంది. రైతులు ధైర్యంగా పరీక్షలు చేయించుకుంటున్నారు. జిల్లాలో ఎరువులు, విత్తన నాణ్యత పరీక్షల కోసం ఐదు చోట్ల ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రధానంగా ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం, గుత్తి, నార్పల ప్రాంతాల్లో ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. ఒక్కో ల్యాబ్‌కు రూ.1.5 కోట్లతో నిర్మించగా, అందులో పరికరాల కోసం మరో రూ.60 లక్షలు వెచ్చించింది. వీటిలో వ్యవసాయ శాఖకు సంబంధించిన ఏఓ (అఫీసియల్ అనలిస్ట్)తో పాటు ఇద్దరు ఏఈఓలు (ఫర్టిలైజర్, సీడ్ జూనియర్ అనలిస్ట్) రైతులకు అందుబాటులో ఉంటూ నాణ్యత పరీక్షలు నిర్వహిస్తుంటారు.

విరివిగా పరీక్షలు:

ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఈ ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లలో వరి విత్తనాల పరీక్షలు ఎక్కువగా నిర్వహిస్తుంటారు. వీటితో పాటు ఇతర విత్తన పరీక్షలు చేస్తుంటారు. అదేవిధంగా ఎరువుల నాణ్యతపై పరీక్షలు నిర్వహిస్తుంటారు. విత్తనాల్లో ఎంత నాణ్యత ఉందనే అంశంపై పరీక్ష చేస్తారు. అన్నీ తగిన విధంగా ఉంటే రైతులకు వివరాలు తెలియజేస్తారు. వీటితో పాటు ఎరువుల నాణ్యతపై పరీక్షలు నిర్వహిస్తారు. అన్నీ సమానంగా ఉంటేనే రైతులకు వివరాలిస్తారు. ఒక్కో ల్యాబ్‌కు నెలకు 150 నుంచి 200 వరకు పరీక్షలు నిర్వహిస్తుంటారు.

అప్పట్లో ఎన్నో ఇబ్బందులు:

2014–19లో రైతుల సమస్యలు తీవ్రంగా ఉండేవి. విత్తనాలు, ఎరువుల విషయంలో నాణ్యత లేకుండా నాసిరకంగా ఉంటే వాటిని రైతులకు సరఫరా చేయడంతో తీవ్రంగా నష్టపోయిన సందర్భాలు ఉన్నాయి. గతంలో ఇలాంటి పరీక్షలు చేయాలంటే విజయవాడకు మాత్రమే శాంపుల్స్ పంపేవారు. వీటిన్నింటిని దృష్టిలో పెట్టుకొని నాణ్యతా ప్రమాణాలు నేరుగా రైతులే తెలుసుకునేలా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ల్యాబ్‌లు ఏర్పాటు చేయడంతో అన్నదాతల నుంచి సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

పారదర్శకంగా పరీక్షలు



ఉరవకొండ ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లో రైతుల నుంచి సేకరించిన ప్రతి శాంపుల్‌ను పరీక్షించి పారదర్శకంగా ఫలితాలు వెల్లడిస్తాం. ఉరవకొండలో అత్యధికంగా వరి, మొక్కజొన్నతో పాటు ఇతర పంటలకు సంబంధించిన పరీక్షలూ చేస్తున్నాం.

– హెచ్.షేకన్న, ఇంటిగ్రేటెడ్ ల్యాబ్, అఫీషియల్ అనలిస్టు, ఉరవకొండ

ల్యాబ్‌తో ఎంతో మేలు



గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ల్యాబ్‌లతో రైతులకు ఎంతో మేలు జరుగుతోంది. ఒకప్పుడు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు నాణ్యతగా ఉన్నాయా? లేదా అనే విషయం తెలిసేది కాదు. ప్రస్తుతం వీటిని ల్యాబ్‌కు ఇచ్చి నాణ్యతగా ఉన్నాయని సర్టిఫికెట్ ఇస్తేనే వాడుతున్నాం.

– శివలింగప్ప, రైతు, రాగులపాడు గ్రామం, వజ్రకరూరు మండలం

రెండడుగుల కోసం ఇంటి నిర్మాణాన్ని కూల్చేశారు!



జేసీబీతో నిర్మాణాన్ని కూల్చేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: వాస్తు కోసం మున్సిపల్ అధికారులు అమాయకులను బలి చేశారు. ఇంటి నిర్మాణ పనులకు అనుమతులు ఉన్నా డబ్బు రుచి చూసిన అధికారులు.. రాజకీయ ఒత్తిళ్లతో ఇంటి సర్వే నంబర్ తప్పని నిర్మాణాన్ని కూల్చేసిన ఘటన కళ్యాణదుర్గంలో సోమవారం చోటుచేసుకుంది. పట్టణంలోని ధర్మవరం రోడ్డు కమ్మాన్ చెట్ల వీధిలో నివాసముంటున్న కంసల వెంకటేష్ సర్వే నం.425/1 లో తనకున్న సొంత స్థలంలో ఇంటి నిర్మాణం ప్రారంభించాడు.పొరుగున ఉన్న ఇంటి యజమాని ఉదయగిరి కుటుంబీకులు తమ భవనానికి వాస్తు సమస్య వస్తుందని, ఎలాగైనా వెంకటేష్ నిర్మాణాన్ని ఆపాలని కుట్ర చేశాడు. ఇందుకు అధికారంలో ఉన్న టీడీపీ నేతలను ఆశ్రయించారు. ఇలా సుమారు రూ.40 లక్షల వరకు వాల్మీకి సర్కిల్‌లో ఉన్న ఓ బలమైన సామాజిక వర్గానికి చెందిన టీడీపీ ముఖ్య నేతకు కట్టబెట్టారు. ఇంకేముంది అడిగిందే తడువుగా ఆ నేత సక్రమమైన వెంకటేష్ నిర్మాణాన్ని వెంటనే ఆపాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. బాధితుడు వెంకటేష్ తనకు కోర్టు అనుమతులు ఉన్నాయని చూపినా ఇవేవీ పట్టనట్లు మున్సిపల్ కమిషనర్ నిర్మాణాన్ని పడగొట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది. వెంకటేష్ సైతం తాను ఇంటి నిర్మాణం చేయకుండా అడ్డుకుంటున్నారని ఉదయగిరి మురళీకృష్ణ, ఉదయగిరి శ్రీకాంత్, ఉదయగిరి హరినాథ్, ఉదయగిరి రాజారాంపైన కోర్టులో పిటీషన్ వేశాడు. ఇదిలా ఉండగా వెంకటేష్ చేపట్టిన నిర్మాణం తొలగించడంపై మున్సిపల్ కమిషనర్‌పై రాజకీయ ఒత్తిళ్లు అధికమైనట్లు తెలుస్తోంది. మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్‌ను అడగ్గా పట్టణంలో అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక డ్రైవ్ చేస్తున్నామన్నారు. నిబంధనలకు అతిక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా ఆవుల జాతర



ప్రత్యేక అలంకరణలో రేణుక ఎల్లమ్మ దేవి

బ్రహ్మసముద్రం: మండలంలోని ముప్పలకుంటలో యాదవుల ఆరాధ్యదైవమైన రేణుక ఎల్లమ్మ దేవి ఆవుల జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ఆలయంలో విశేష పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని ప్రజలు తమ పాడి పశువులను, సైతం అమ్మవారి గూడు చుట్టూ ప్రదక్షిణలు చేయించారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

కూడేరు: మండలంలని పీఏబీఆర్ వద్ద ఏర్పాటు చేసిన కూడేరు, ఉరవకొండ, సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి ప్రాజెక్టులను ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం సందర్శించారు. వాష్ ఫిల్టర్ బెడ్లను పరిశీలించారు. ఏప్రాజెక్ట్ ద్వారా ఎంత తాగునీటిని ఎన్ని గ్రామాలకు అందిస్తున్నారని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఆరా తీశారు. వచ్చే వేసవి నాటికి ఉరవకొండ నియోజక వర్గంలోని కూడేరు, ఉరవకొండ, బెలుగుప్ప, వజ్రకరూరు, విడపనకల్లు మండలాల్లో ఏ గ్రామంలోను తాగునీటి ఎద్దడి లేకుండా ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మురళీధర్, సత్యసాయి డీఈ రామారావు, ఉరవకొండ డీఈ సద్రీనా , తహసీల్దార్ మహబూబ్ బాషా, జేఈలు నాగ దివ్యా, చౌదరి, గంగాభార్గవ్, ఐజయ్య, మంజునాథ్, ముజమిల్, హర్షా, శివ కృష్ణ పాల్గొన్నారు.

పోలీసుల సేవలు వెలకట్టలేనివి



అమరవీరులకు నివాళులర్పిస్తున్న పోలీసులు



కళ్యాణదుర్గంలో శ్రద్ధాంజలి ఘటిస్తున్న పోలీసులు

రాయదుర్గం: పోలీసుల సేవలు వెలకట్టలేనివని అర్బన్, రూరల్ సీఐలు జయనాయక్, వెంకటరమణ తెలిపారు. సోమవారం అర్బన్‌తోపాటు మండలాల్లోని ఆయా పీఎస్‌లలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. సీఐలు హాజరయ్యారు. అనంతరం సీఐలు మాట్లాడుతూ పోలీసులు ప్రతికూల పరిస్థితుల్లోనూ మొక్కవోని ధైర్యంతో విధుల నిర్వహించి, శాంతిభద్రతలను కాపాడుతున్నారన్నారు. విధి నిర్వహణలో ఎందరో తమ ప్రాణాలను త్యజించారని, వారి పవిత్ర ఆత్మకు శాంతిచేకూరాలని కోరుకున్నారు. కార్యక్రమాల్లో పట్టణ పీఎస్‌లో ఎస్ఐలు బుల్లెట్ వలీ, బాలరాజు, ఏఎస్ఐలు వెంకటేశులు, హెడ్‌కానిస్టేబుల్ బాలు, బాస్కర్, సిబ్బంది వీరేంద్ర, అశోక్, అనిల్, అలాగే ఆయా మండల పీఎస్‌లలో ఎస్ఐలు వారి సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

కళ్యాణదుర్గం రూరల్: శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణాలు ఎదురొడ్డి పోరాడిన పోలీసుల త్యాగాలు మరువలేనివని డీఎస్పీ రవిబాబు తెలిపారు. సోమవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీసుల అమరవీరుల దినోత్సవం సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో అమరవీరుల స్థూపం వద్ద డీఎస్పీ రవిబాబు ఆధ్వర్యంలో పోలీసు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించాలి.

విద్యుత్ సబ్ స్టేషన్‌కు స్థలం కేటాయించండి

- జిల్లా కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



కలెక్టర్ వినోద్‌కుమార్‌తో నియోజకవర్గ సమస్యలపై చర్చిస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

విడపనకల్లు: విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించడానికి స్థలం కేటాయించాలని, కొనకొండ్ల గ్రామంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఫిల్టర్ బెడ్లను మార్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్‌ను ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ చాంబర్‌లో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి కలెక్టర్‌ను కలిసి ఉరవకొండ నియోజకవర్గంలోని పలు సమస్యలను వివరించారు. కూడేరు మండలంలోని నూతనంగా 132 కేవీ విద్యుత్ ఉప కేంద్రం ఏర్పాటుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేశారన్నారు. అప్పటి విద్యుత్ శాఖాధికారులు సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి కేటాయించాలని అనేకసార్లు రెవెన్యూ అధికారులను కోరినా పట్టించుకోకపోవడంతో అలసత్వం వహిస్తునానరని, వెంటనే రెవెన్యూ శాఖాధికారులు విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ఐదెకరాలు భూమిని కేటాయించే విధంగా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కొనకొండలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ద్వారా 20 గ్రామాలకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాగునీరు సరఫరా చేస్తున్నారని తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు సంబంధించి ఫిల్టర్ బెడ్లు మార్చడానికి పనులు మంజూరయ్యాయన్నారు. సత్య సాయి జిల్లా పుట్టపర్తి నందు రెండు నూతన మైక్రో ఫిల్టర్ బెడ్లు అదనంగా ఉన్నాయని, వాటిని కొనకొండ్ల సమ్మర్ స్టోరేజ్‌కు తరలించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఎమ్మెల్సీ కోరారు. భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

కొల్లాపురమ్మ ఆలయానికి విరాళం



బేలోడు గ్రామస్తులకు చెక్కు అందిస్తున్న మెట్టు విశ్వనాథరెడ్డి

గుమ్మఘట్ట: మండలంలోని బేలోడులో నూతనంగా నిర్మిస్తున్న కొల్లాపురమ్మ ఆలయానికి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి తనవంతుగా రూ.1,40,000 (చెక్కు రూపంలో) అందించారు. చెక్కును యువ నాయకుడు మెట్టు విశ్వనాథరెడ్డి చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు చంద్రన్న, రుద్రప్ప, గంగన్న, హనుమన్న, శాంతకుమార్, నాయకులు రంగచేడు వెంకటేశులు, బానేపల్లి తిప్పేస్వామి, బేలోడు వెంకటేశులు పాల్గొన్నారు.

కులవివక్ష చూపిన వారిపై చర్యలు తీసుకోండి

బ్రహ్మసముద్రం: మండలంలోని పడమటి కోడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో కులవివక్ష చూపిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారు పడమటి కోడిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్సీ ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు నెరిమెట్ల ఎల్లన్న, సాకే చిరంజీవి, సబ్ డివిజినల్ సభ్యులు మోహన్ కుమార్, రామాంజనేయులు, ఎస్సీ ఎస్టీ ఫోరం నాయకులు మీసుగ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామసభలు

కూడేరు: మండల పరిధిలో సమగ్ర భూసర్వే పూర్తయిన తిమ్మాపురంలో మంగళవారం ఉదయం, ఎంఎంహళ్లి గ్రామాల్లో మధ్యాహ్నం గ్రామసభలు ఉంటాయనితహసీల్దార్ మహబూబ్ బాషా తెలిపారు.

నేడు పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 22న మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసులు తెలిపారు. ప్రముఖ కంపెనీలు టాటా ఎలక్ట్రానిక్స్, కోజెంట్ ఈ-సర్వీసస్ సహకారంతో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో జరిగే జాబ్‌మేళాలో జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసిన వారు ఉదయం 9 గంటలకు జాబ్‌మేళాకు హాజరుకావాలని కోరారు.

మోడల్ స్కూల్‌కు రోడ్డు ఏర్పాటు చేయండి

విడపనకల్లు: మండలంలోని చిన్నముష్టూరు వద్ద ఉన్న ఆదర్శ పాఠశాల, పాలిటెక్నిక్ కళాశాలలకు వెళ్లేందుకు రహదారి నిర్మించాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌ను ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, అధ్యక్షుడు హనుమంతురాయుడు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వారు వినతిపత్రం అందించారు.

అంగన్‌వాడీ పోస్టులకు మౌఖిక పరీక్ష

రాయదుర్గం: రాయదుర్గం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని డీహీరేహాళ్ మండలం మురడి, ఎస్ఆర్ కోట గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు ఈ నెల 24న కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయంలో మౌఖిక పరీక్ష ఉంటుందని సీడీపీఓ పద్మావతి ఓ ప్రకటనలో తెలిపారు.

భూ అక్రమార్కులపై చర్యలు తీసుకోండి

కంబదూరు: భూముల కొనుగోలు పేరుతో వంకలు, వాగులను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ,ఎస్టీ జేఏసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు తహసీల్దార్ బాలకిషన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఎస్సీ,ఎస్టీ జేఏసీ సంఘాల మండల అధ్యక్షుడు డాబా రమేష్, ఎరికుల సంఘం మండల అధ్యక్షుడు సుబ్బరాయుడు, నాయకులు రఘు, వెంకటేశులు, తిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ

కుందుర్పి: స్థానిక కుసుమగిరి రైతు ఉత్పత్తి దారుల కంపెనీ లిమిటెడ్ వారి సౌజన్యంతో సోమవారం ఐదు చోట్ల కుట్టుశిక్షణ కేంద్రాలను ప్రారంభించినట్లు సంస్థ సీఈఓ నరసింహమూర్తి, అధ్యక్షులు లక్ష్మీపతి తదితరులు తెలిపారు. కుందుర్పిలో రెండు, అప్పిలేపల్లి, తెనగల్లు, కలిగొలిమిలో కుట్టు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పంటకోత ప్రయోగాలు

వజ్రకరూరు: మండలంలోని గూళ్యపాళ్యంలో కృష్ణవేణి అనే మహిళా రైతుపొలం (సర్వేనం–63)లో సోమవారం వేరుశనగ పంట కోత ప్రయోగాలు చేసినట్లు ఏఓ మధుకర్, సహాయ గణాంకాధికారి సుభాషిణి, వీపీఏ రాజేష్ తదితరులు తెలిపారు. 3.550 కిలోల దిగుబడి వచ్చినట్లు తెలిపారు.

ఆరుబయట అంగన్‌వాడీ పిల్లలు



అంగన్‌వాడీ కేంద్రం-1 బయట కూర్చున్న పిల్లలు

శెట్టూరు: ములకలేడులో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి అంగన్‌వాడీ కేంద్రం–1 భవనం కారింది. సోమవారం ఉదయం కేంద్రాన్ని తెరిచిన అంగన్‌వాడీ సిబ్బంది వర్షపునీటిని బయటకు ఎత్తిపోశారు. పాతబడిన భవనం కావడంతో వర్షపునీరు కారుతుండటంతో పిల్లలను ఆరుబయటే కూర్చోబెట్టారు. అటుగా వెళ్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు ఆరాతీశారు. అంగన్‌వాడీ కేంద్రానికి పక్కాభవనం నిర్మించాలని డిమాండ్ చేశారు.

సాగులో ఉన్నాం.. పట్టాలివ్వండి సారూ..

గుమ్మఘట్ట: నలభై ఏళ్లుగా సాగులో ఉన్నాం.. పట్టాలివ్వండి సారూ అని ఎస్.హొసహళ్లి రైతులు మల్లికార్జున, నారాయణస్వామి, హనుమంతరాయుడు, ఓబన్న, బసవరాజు, కొండారెడ్డి, తిప్పేస్వామి, చంద్ర తదితరులు తహసీల్దార్ శ్రీనివాసులుకు సోమవారం విన్నవించారు.

సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకోండి

బ్రహ్మసముద్రం: భైరవానితిప్ప గ్రామ సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ నందకిశోర్‌కు గ్రామ సర్పంచ్ శెట్టిగారి మంజునాథ వినతి పత్రం అందించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

బెళుగుప్ప: మండలంలోని గంగవరం వద్ద పేకాట స్థావరంపై సోమవారం తమ సిబ్బందితో కలసి దాడులు నిర్వహించి, ఏడుగురిని అ రెస్ట్ చేశామని ఎస్ఐ శివ తెలిపారు. రూ.2950 నగదును స్వాధీనం చేసుకున్నారు.

బీటీపీకి కొనసాగుతున్న వరద

గుమ్మఘట్ట: భైరవానితిప్ప ప్రాజెక్టుకు వరదనీరు కొనసాగుతోంది. ఎగువన ఉన్న కర్ణాటక నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో నీటిమట్టం పెరుగుతోంది. సోమవారం నాటికి 1651.4 అడుగుల మేర నీరు రావడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

కళ్యాణదుర్గం: బ్రహ్మసముద్రం మండలం పడమటి కోడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో కుల వివక్ష చూపిన వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని విజిలెన్స్ ఎస్సీ,ఎస్టీ పర్యవేక్షణ కమిటీ జిల్లా, నియోజకవర్గ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా, తాలూకా కమిటీ సభ్యులు ఎల్లన్న, మోహన్, రామాంజనేయులు, ఎస్సీ,ఎస్టీ ఫోరం నా య కులు రామాంజనేయులు, వంశీకృష్ణ తదితరులు ఇన్‌చార్జ్ ఆర్డీఓ బి.వినూత్నకు వినతిపత్రం అందజేశారు.

రీసర్వే గ్రామసభలు

బెళుగుప్ప: మండల పరిధిలోని ఆవులెన్న, గుండ్లపల్లి గ్రామాల్లో తహసీల్దార్ షర్మిళ ఆధ్వర్యంలో సోమవారం గ్రామసభలు నిర్వహించారు. రైతుల నుంచి 62 వినతులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

వజ్రకరూరు: చిన్నహోతూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు వరుణ్‌సాత్విక్, జ్యోతిరామ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 20న గుంతకల్లు ఎస్‌కేపీ డిగ్రీ కళాశాలలో జరిగిన అండర్-18 జూనియర్ ఖోఖో పోటీల్లో చిన్నహోతూరు జెడ్పీహెచ్ఎస్ ఎనిమిదో తరగతి విద్యార్థులు వరుణ్‌సాత్విక్, జ్యోతిరామ్ పాల్గొని, ప్రతిభ కనబరిచారని పీడీ ప్రభాకర్ తెలిపారు. ఈనెల 25,26,27 తేదీల్లో వీరు చిత్తూరు జిల్లా కాణిపాకంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఆర్థిక సాయం

కుందుర్పి: మండల కేంద్రానికి చెందిన శాంతరాజుకు ఇన్నిని‌టీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బద్దేనాయక్ రూ.20వేల ఆర్థికసాయాన్ని సోమవారం అందించారు. శాంతరాజు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు.

ముమ్మరంగా పన్ను వసూళ్లు

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలక సంఘంలో ఆస్తి, నీటి కొళాయి పన్ను వసూళ్లు నత్తనడకన కొనసాగుతున్నాయి. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో బిల్ కలెక్టర్లు, సచివాలయ సిబ్బంది పన్నుల వసూళ్లపై దృష్టిసారించారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో 18,664 అసెస్‌మెంట్లు ఉండగా, రూ.5.08 కోట్ల పన్ను వసూలు కావాల్సి ఉంది. 11,087 కొళాయి కనెక్షన్లకు గాను రూ.4.18 కోట్ల నీటి పన్ను వసూలు కావాల్సి ఉంది. ఇప్పటి దాకా రూ.1.57 కోట్ల ఆస్తి పన్ను, రూ.31.58 లక్షల నీటి పన్ను వసూలు చేశారు.

గాయపడిన వ్యక్తి మృతి

శెట్టూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. శెట్టూరుకు చెందిన బోయ బాబు (38) ఈ నెల16న తిప్పనపల్లికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పెరుగుపాళ్యం తోటల దగ్గర కుక్క అడ్డు రావడంతో తప్పించే క్రమంలో అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం బాబు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపారు. బాబుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడిపై మూకుమ్మడి దాడి

గుమ్మఘట్ట: వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు రాము ఇంటిపైన టీడీపీకి చెందిన అజయ్, ముద్దలాపురం మారెన్న, లింగప్ప, బొమ్మన్న, కుశాల్, పరమేశ్, లక్ష్మన్న దాడి చేశారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. అడ్డువచ్చిన రాముడు సోదరుడు అశోక్‌పైనా దాడి చేశారని తెలిపాడు. వివరాలు.. 75 వీరాపురానికి చెందిన రాము కుమారుడు పృథ్వీ రాయదుర్గంలో ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్నాడు. పాఠశాల బస్సుకు డ్రైవర్‌గా ఉన్న అజయ్..చిన్నారి పృథ్వీని పాఠశాలలోనే వదిలేసి వెళ్లాడు. పిల్లవాడు ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన రాము దంపతులు పాఠశాల యాజమాన్యానికి ఫోన్‌లో ఆరాతీశారు. చిన్నారిని ఇక్కడే వదిలేశారని తెలపడంతో ..బస్సు డ్రైవర్ అయిన అజయ్‌ను బాధితులు ప్రశ్నించారు. దీంతో కోపోద్రిక్తుడైన అజయ్.. మరికొందరు బంధువులతో కలిసి రాముడు ఇంటిపైన రాళ్లు, కట్టెలతో దాడి చేసి, గాయపరిచారు. గాయపడిన రాముడు,అశోక్‌లను రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

ముగ్గురికి తీవ్ర గాయాలు

కూడేరు: శివరాంపేట వద్ద అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దామోదర్, అశోక్, వినోద్ అనే ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

అక్రమ కట్టడాలపై చర్యలు

రాయదుర్గంటౌన్: పురపాలక సంఘం పరిధిలో ఎవరైనా అనుమతులు లేకుండా కట్టడాలు గాని, లేఅవుట్లు వేసి ఆదాయానికి గండికొడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పట్టణ ప్రణాళిక విభాగం సూపర్‌వైజర్ (టీపీఎస్) మురళీమోహన్ హెచ్చరించారు. టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా గుంతకల్లు మున్సిపాలిటీ నుంచి రాయదుర్గానికి బదిలీపై వచ్చిన ఆయన..నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ టీపీఎస్‌గా పనిచేస్తున్న మారుతీప్రసాద్ గుత్తికి బదిలీ అయ్యారు. అనంతరం ఆయన సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలతో సోమవారం సమావేశం నిర్వహించారు.

భర్త ఆచూకీ తెలపాలని ఫిర్యాదు

విడపనకల్లు: తన భర్త దూదేకుల హుస్సేన్ రెండేళ్లుగా కనిపించలేదని ఆశా అనే వివాహిత ఉరవకొండ పోలీసులను సోమవారం ఆశ్రయించింది. 2020లో వజ్రకరూరు మండలంలోని పీసీ కొత్తకోటకు చెందిన దూదేకుల కాశమ్మ కుమారుడు దూదేకుల హుస్సేన్‌తో తనకు వివాహమైందని ఆశా తెలిపింది. 2021 వరకు కలిసి ఉన్నామని, 2022 ఏప్రిల్ 14 నుంచి తన భర్త కనిపించకుండా పోయాడని తెలిపింది. తన భర్త కనిపించకుండా పోవడానికి అత్త కాశమ్మ, వదిన అమీన అని, తన భర్తను కర్నూలు జిల్లాలో డోన్‌లో దాచినట్లు బాధితురాలు వాపోయింది.